పేదల పక్షపాతి సీఎం జగన్



సీతానగరం: ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందాం
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట:

పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా గుర్తింపు పొందారని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో పేదలంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. మండలంలోని చిలకలపల్లిలో సోమవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన నాటినుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు మేలు చేయాలనే ఆలోచనతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలను ఎప్పుడూ నిలుపుదల చేయలేదని అన్నారు. పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందించారని గుర్తుచేశారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారని అన్నారు. గత టీడీపీ పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలని కోరారు. గతంలో పచ్చచొక్కాలు వేసుకున్న వారికే పథకాలు అందేవని, కానీ నేడు అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని అన్నారు. అవినీతి, లంచగొండితనం వంటివి లేకుండా పారదర్శకంగా అందించిన సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తనూజారాణిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, జడ్పీటీసీ ఎ.రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ ఎం.శ్రీకాంత్, దాసరి కార్పొరేషన్ చైర్పర్సన్ రమాదేవి, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు దుర్గేశ్వరి, టి.ప్రసాదరావు, ఎస్.వాసుదేవరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతానగరం: ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



బలిజిపేట: చిలకలపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- అభివృద్ధిని చూసి ఓటేయండి: ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: రాష్ట్రంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. మండలంలోని రామవరంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. స్థానిక నాయకులు పి.సూర్యనారాయణ, ఆర్.తవిటినాయుడు, తదితరులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రామవరంలో రూ.1.35 కోట్లతో బీటీరోడ్డు, రూ.22 లక్షలతో రైతుభరోసా కేంద్రాన్ని నిర్మించినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించామన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, డీసీసీబీ డైరెక్టర్ ఎ.కృష్ణంనాయుడు, ప్రభాకర్‌నాయుడు, ఆర్వీ పార్థసారధి, ఎస్.రామకృష్ణ, సత్యం, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



పార్వతీపురంటౌన్: పట్టణంలో 19వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఏపీటిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

- ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురంటౌన్: సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. పట్టణంలోని 13,19 వార్డుల్లో సోమవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల ద్వారా పేదలను లక్షాధికారులుగా చేసిన ఘతన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మోసం చేసేందుకు ప్రజల మధ్యలో తిరుగుతున్నారని, వారి మాటలను నమ్మొద్దని కోరారు. ప్రజలకు మళ్లీ సంక్షేమ పథకాలు అందాలంటే ఎమ్మెల్యేగా జోగారావును, ఎంపీగా డాక్టర్ గుమ్మ తనూజారాణిని గెలిపించుకొని జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్లు తెలుగు బోదయ్య, నేతాజీ, రణభేరి చిన్నంనాయుడు, నిమ్మకాయల సుధీర్, సువ్వాడ శ్రీను, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

సాలూరు రూరల్: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ అన్నారు. కొత్తవలస గ్రామంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. అభివృద్ధి రెట్టింపు అవ్వాలన్నా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిత్యం పాటుపడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొరను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని ఆమె కోరారు.



సాలూరు రూరల్: ఇంటింటి ప్రచారం చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ

ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఆశీర్వదించండి



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని మహిళలను కోరుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర



డిప్యూటీ సీఎం రాజన్నదొరకు పూలమాల వేసి స్వాగతం పలుకుతున్న మహిళలు

- ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పాలన, అభివృద్ధిని కొనసాగించేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం, సాలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర కోరారు. పట్టణంలోని రామా కాలనీలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజన్నదొరకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ప్రతీ గడప వద్ద మహిళలు హారతులు ఇచ్చి విజయతిలకం దిద్దారు. జై జగన్, జై రాజన్నదొర నినాదాలతో రామా కాలనీ మార్మోగింది. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేయడమే మా అజెండా అని స్పష్టం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. కోట్లాది రుపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేసింది జగన్‌మోహన్‌రెడ్డి అయితే, మోసం చేసింది చంద్రబాబని అని విమర్శించారు. ఎన్నికల వేళ ప్రజలను మరలా మోసం చేసేందుకు టీడీపీ నాయకులు వస్తున్నారని, వారిని నమ్మొద్దని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుడమితల్లిని కాపాడుకుందాం



'సేవ్ ఎర్త్' ప్లకార్డులతో విద్యార్థులు

సాలూరు రూరల్: మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీ ఎన్‌జీసీ ఆధ్వర్యంలో సోమవారం ధరిత్రీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏపీ ఎన్‌జీసీ క్లస్టర్ కో–ఆర్డినేటర్ డి.ప్రశన్నకుమార్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, భూమిని కాపాడుకునేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని అన్నారు. హెచ్‌ఎం నల్లా వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీఓ ఈశ్వరమ్మ

మక్కువ: మండలంలోని శంబర, ఎస్.పెద్దవలస గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను ఏపీఓ ఈశ్వరమ్మ సోమవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం, సాయంత్రం సమయాల్లో పనులు చేయాలని, పని ప్రదేశం వద్ద తాగునీరు, నీడ సౌకర్యం అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. నిర్దేశించిన కొలతల మేరకు పనులు చేపడితే గరిష్ట వేతనం పొందవచ్చన్నారు.

నామినేషన్ కార్యక్రమానికి తరలిరండి

- కార్యకర్తలకు ఎమ్మెల్యే జోగారావు పిలుపు

బలిజిపేట: ఈనెల 24న నిర్వహించే నామినేషన్ కార్యక్రమానికి తరలిరావాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పిలుపునిచ్చారు. చిలకలపల్లి శ్రీవాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమ వారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 24న ఉదయం 10 గంటలకు పార్వతీపురం అసెంబ్లీ స్థానానికి తాను నామినేషన్ వేయనున్నట్లు చెప్పారు. ఉదయం 8 గంటలకు పార్వతీపురం పాత బస్టాండ్ సెంటరు నుంచి పాదయాత్రగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సర్పంచ్ సుందరరావు, పార్టీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, జడ్పీటీసీ ఎ.రవికుమార్, ఎంపీపీ నాగమణి, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ ఎం.శ్రీకాంత్, దాసరి కార్పొరేషన్ చైర్పర్సన్ రమాదేవి, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో 150 కుటుంబాలు చేరిక



పార్వతీపురంటౌన్: పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో 150 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జోగారావు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా, అలజంగి జోగారావును ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తుమ్మనపల్లి సత్యవతి వెంకటరమణ, ఎంపీటీసీ టి.పార్వతి, నియోజకవర్గ సీనియర్ నాయకులు పోల సత్యనారాయణ, పల్లి భానుప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చప్ప సురేష్, చిన్ని లక్ష్మణ, అప్పలనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తకామునివలసలో..

మక్కువ: మండలంలోని ఎస్.పెద్దవలస పంచాయతీ కొత్తకామునివలస గ్రామానికి చెందిన ఆరు గిరిజన కుటుంబాలు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు సమక్షంలో గ్రామానికి చెందిన సీదరపు బీసు, చోడిపల్లి అనిల్‌కుమార్, రాము, రాజేశ్, శ్రీరాము, గౌరమ్మ పార్టీలో చేరారు. వారందరికీ రంగునాయుడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ కోసం సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పూడి శ్రీను, తేలు శ్రీరాములునాయుడు, గోపి, శ్రీధర్, పాన్నాడ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మక్కువ: పార్టీలో చేరిన గిరిజనులతో రంగునాయుడు

పదిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ



పార్వతీపురంటౌన్: విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ సింహాచలం, ఉపాధ్యాయులు



సీతానగరం: నిడగల్లు పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శివున్నాయుడు

పార్వతీపురంటౌన్: పదో తరగతి ఫలితాల్లో పార్వతీపురంమన్యం జిల్లా విద్యార్థులు మరోసారి ప్రతిభ కనబరిచారు. పలు పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణత నమోదైంది. ఫలితాల్లో బాలురు కంటే బాలికలే పైచేయి సాధించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను విద్యాశాఖ అధికారులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు. పార్వతీపురం మండలం కేంద్రంలోని టీఆర్‌ఎంఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన కేబీ గౌతమి (591, పెదబొండపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని యాండ్రాపు శోభారాణి(583) మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను ఎంఈఓ సామల సింహాచలం అభినందించారు.

సీతానగరం: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. మండలంలోని నిడగల్లు, ఆర్.వెంకంపేట, మరిపివలస ఉన్నత పాఠశాలలతో పాటు జోగింపేట కేజీబీవీ, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, ఏపీటీడబ్ల్యూఆర్(ఎస్ఓఈ) పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత నమోదైంది. బూర్జ హైస్కూల్‌లో 96 శాతం, గాదెలవలస హైస్కూల్‌లో 98 శాతం, సీతానగరం హైస్కూల్‌లో 97 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈఓ జి.సూరిదేముడు తెలిపారు. కె.అఖిల్ అభివర్మ (580), పి.స్టీఫెన్ (569), జి.గణేష్(571), జి.రోహిత్(562) మార్కులు సాధించారు. వారికి ఎంఈఓ అభినందించారు.

మక్కువ: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ములక్కాయవలస మోడల్ పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రిన్సిపాల్ ఎన్.స్వర్ణలత తెలిపారు. పాఠశాల నుంచి జులైకబేగం(582), మౌనిక (570), మహిమ(566), పూజిత(564)మార్కులు సాధించారు. అలాగే 51 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించినట్లు ఆమె తెలిపారు. అలాగే కాశీపట్నం కేజీబీవీ పాఠశాల నుంచి 35 మంది పరీక్షలు రాయగా.. 34 మంది ఉత్తీర్ణులైనట్లు ఎస్ఓ నాగదుర్గ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల నుంచి 219 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా.. వారిలో 201 మంది ఉత్తీర్ణులయ్యారు. జి.పూజిత(579), భువనకృతి (579)మార్కులు సాధించారు.



కందుల మౌనిక (583), అపురోహితునివలస ఆదర్శ పాఠశాల, సాలూరు



జులైకబేగం(582) ములక్కాయవలస మోడల్ స్కూల్, మక్కువ



మేఘన(582), అజ్జాడ ఉన్నత పాఠశాల, బలిజిపేట



కె.అఖిల్ అభివర్మ (580), నిడగల్లు జెడ్పీహెచ్‌ఎస్, సీతానగరం



పూజిత(579) జెడ్పీహెచ్‌ఎస్, మక్కువ



భువనకృతి(579) జెడ్పీహెచ్‌ఎస్, మక్కువ



సంజీ (575) జెడ్పీహెచ్‌ఎస్, మక్కువ



మౌనిక (570) ములక్కాయవలస మోడల్ స్కూల్, మక్కువ

బలిజిపేట: మండలంలోని అరసాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 22 మంది పదో తరగతి పరీక్షలు రాయగా.. అందరూ ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అజ్జాడ ఉన్నత పాఠశాల నుంచి 23 మంది పరీక్షలు రాయగా.. 22 మంది పాసయ్యారు. వారిలో సీహెచ్.మేఘన 582 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. అలాగే పెదపెంకి పాఠశాలలో 41 మందికి గాను 40 మంది ఉత్తీర్ణులయ్యారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో 121 మందికి గాను 114 మంది, వంతరాం ఉన్నత పాఠశాలలో 52 మందికి 48 మంది, కేజీబీవీలో 19 మందికి 15 మంది, నారన్నాయుడువలసలో 53 మందికి 49 మంది, చిలకలపల్లిలో 25 మందికి 22 మంది, నారాయణపురంలో 14మందికి 12 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

సాలూరు: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని 19 ప్రభుత్వ పాఠశాలల నుంచి సరాసరి 94 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రాజ్‌కుమార్ తెలిపారు. అపురోహితునివలస ఆదర్శపాఠశాల విద్యార్థిని కందుల మౌనిక అత్యధికంగా 583 మార్కులు సాధించింది. విద్యార్థినిని ఎంఈఓ అభినందించారు.

సాలూరు రూరల్: పదో తరగతి ఫలితాల్లో మావుడి గిరిజన ఆశ్రమ పాఠశాల, శివారంపురం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు. అలాగే మామిడిపల్లి జెడ్పీ హెచ్‌ఎస్ నుంచి 77 మంది పరీక్షలు రాయగా 69 మంది ఉత్తీర్ణులయ్యారు. తోణాం గిరిజన ఆశ్రమ పాఠశాలలో 27 మంది విద్యార్థులకు 26 మంది ఉత్తీర్ణులయ్యారు. వారంతా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. కొత్తవలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో 110 మంది విద్యార్థులకు గాను 107 మంది, ఖరాసువలస కేజీబీవీలో 33 మంది విద్యార్థినులకు గాను 31 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

క్లుప్తంగా

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న వేదపండితులు కామేశ్వరశర్మ, సాయినాథ్‌శర్మ

సీతానగరం: మండలంలోని చెల్లన్నాయుడువలసలో మూడు రోజులుగా నిర్వహించిన కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు సోమవారంతో ముగిశాయి. వేదపండితులు గన్నవరపు కామేశ్వర శర్మ, శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో యజుర్వేద పండితులు జి.సాయినాద్ శర్మ పర్యవేక్షణలో మూడురోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజు కార్యక్రమాల్లో భాగంగా పూర్ణకుంభం, శివలింగం, పార్వతీదేవి, విఘ్నేశ్వర స్వామి విగ్రహాలకు ప్రాణప్రతిష్ట చేశారు. అనంతరం వేదపండితులకు ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారి తిరువీధి ఉత్సవంలో కోలాటం ఆడుతున్న కళాకారులు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీ తీరాన వెలసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షిక మహోత్సవాలు సోమవారం వైభవంగా కొనసాగాయి. ఆలయ ప్రధాన అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పి.రామానుజాచార్యులు, కృష్ణమాచార్యులు, మురారీతో కలిసి నిత్యారాధన, తీర్థప్రసాద వితరణ, అగ్ని ప్రతిష్ట, ధ్వజపతాక ప్రతిష్ట, నిత్య హోమ పూజలు, తిరువీధి కార్యక్రమాలు జరిపించారు. మంగళవారం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

11 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను చూపిస్తున్న వలంటీర్లు

పాచిపెంట: మండలంలో 11 మంది గ్రామ వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. పద్మాపురం సచివాలయ పరిధిలో 9 మంది, పాచిపెంట–1 సచివాలయ పరిధిలో ఇద్దరు, కొటికిపెంట సచివాలయం నుంచి ఒకరు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను మండల పరిషత్ కార్యాలయం అధికారులకు అందజేశారు. ప్రజలకు సేవ చేసే అవకాశం ఇచ్చిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా, రాజన్నదొరను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు తమ వంతు కృషిచేస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పరిశుభ్రత తప్పనిసరి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురంటౌన్: పోలింగ్ కేంద్రాల వద్ద పరిశుభ్రత తప్పనిసరి అని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. పట్టణంలోని 23,24,35,32,33 పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. కేంద్రాల పరిసరాల్లో పూర్తిస్థాయిలో శానిటేషన్ పనులు చేయించాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మురళీని ఆదేశించారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- డీఎంఓ డాక్టర్ టి.జగన్మోహనరావు



ఆర్: దీర్ఘకాలిక రోగులతో మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ టి.జగన్మోహనరావు

పార్వతీపురంటౌన్: వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా ఆధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. బాలగుడబ గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. జ్వరాలు, వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో సిబ్బంది చేపట్టిన నివారణ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఫీవర్ సర్వే నివేదికలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. దీర్ఘకాలిక రోగులతో మాట్లాడి వారికి అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. పారిశుధ్య నిర్వహణను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పలుచోట్ల దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి ధనుంజయరావు, సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్యసిబ్బంది శ్రీధర్, జగదీష్, ఆశ, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.